కథానిక

# మాతృత్వం

యాముజాల శంకరం

వివాదగ్రస్తమైన విషయాన్ని విమర్శించేటప్పుడు వివిధ వ్యక్తుల భావాలు విభిన్నంగా ఉంటాయి. వాదించే వ్యక్తుల హావభావాలు ముఖకవళికలు, మనస్తత్వాలు మరింత విచిత్రంగా ఉంటాయి.

మా రంగారావు వాదిస్తూ ఉంటే అరటిపండు ఒలచినట్లుగా ఉంటుంది. రాజు అలాంటివాడు కాదు. తను చెప్పింది వేదాక్షర మంటూంటాడు. కొండల్ని, బండల్ని పిండికొడుతూన్నట్లే ఉంటుంది-అతని మాటల ధోరణి. చిరాకు, కోపం, ఉద్రేకం-అవన్నీ అతని సొత్తు. దబాయించటంలో ఘట్టు. సారంలేని వాదం...అంతా ఊకపొట్టు ఎక్కువగా ఉంటుంది. ఇహ కృష్ణ పెద్దవాడు కాబట్టి ఏమీ అనలేక వింటూంటాము. ప్రసాదును అంతా కొంచెం తక్కువగా చూస్తాం కాబట్టి అతను చెప్పేదాంట్లో పస ఉన్నా విసుగే.

“అబ్సర్డ్...” వినివిని అన్నాడు రంగా... “పురుషునిలో మాతృత్వం కలగటమనేది; పువ్వులాకాశంలో పుష్పించినట్లే.”

“వాస్తవం. పితృహృదయం కాస్త మెత్తగా ఉండవచ్చు. అంతమాత్రంచేత మాతృత్వం కలగటం అసంభవం” అన్నాడు కృష్ణ.

“అలా అంటానికి వీల్లేదు. తల్లి చచ్చిపోయిన తరువాత ఆ బాధ్యత తన భుజస్కంధాలమీద వేసుకున్నప్పుడు - మాతృ హృదయం అతనిలో కలుగకపోతే అతను ఆబిడ్డని పెంచలేడు. అప్పుడు రెండు బాధ్యతలు అతనిలోనే వాటంతట అవి కలుగుతాయి” నేనూ ఓ మాట అన్నా.

ప్రసాదు చచ్చీచావని గొంతుతో గొణిగాడు “ఎవరైతే పాలుపట్టటం దగ్గరనుంచి బాధ్యత వహించాడో అతనిలో మాతృ హృదయం మొలకలెత్తుతుంది...”

“రైట్. ప్రసాదు చాలా మంచిగా చెప్పాడు. నేను యిందాకటినుంచి అంటూనే ఉన్నాను. చిన్న బిడ్డదగ్గరనుంచి సాకితే తప్పకుండా మాతృత్వం అతనిలో కలుగుతుంది. పాలుపట్టడంలోనే మాతృత్వ ముంది...ఓ జంతు వుందనుకోండి-ఓ కుక్కనో, మేకనో తీసుకోండి. సహజంగా చాలామంది వీటిని పెంచుతారు కాబట్టి, ఆ కుక్కనో, మేకనో, పసితనంనుంచి పాలుపోసి పెంచితే అప్పుడు కలిగే పరివర్తన వేరు. అదే ఏ పెద్దవాటినో పెంచి ఇంత అన్నమో గడ్డో పడవేయి...ఆ స్పందనం వేరు” అంటూ రాజు కాసేపు నటించాడు.

“అయితే మాతృత్వం అంటే ఏమిటి?...” ప్రశ్నించాను.

“అది ఎంతో సున్నితమైనది. వెన్న కన్నా మెత్తనయినది. ఏమాత్రం కల్మషంచేత కానికి అవకాశంలేనటువంటిది నిర్మలమైనది. బిడ్డ కొంచెం బాధపడితే తల్లిహృదయంలోసముద్ర తరంగాలు తాండవంత్రొక్కుతాయి. అందుకేత్యాగంచేయడానికైనా వెనుకాడదు” ఈవిధంగా ఉపన్యసించాడు రంగా.

“అయితే నువ్వు చెప్పిందంతా స్త్రీల విషయంలో నిజమే. ఎందుకంటే వాళ్ళే సున్నితమైనవారు కాబట్టి వాళ్ళహృదయం ఇంకా సున్నితంగా ఉండవచ్చు. అంతమాత్రంచేత అవి మొగాడిలో కలుగుతాయంటావా?...” అన్నాడు కృష్ణ.

“ఆఁ.” అన్నాడు రాజు.

“ఇంతవరకు వీళ్లు తల్లిహృదయం కొంతభాగం విమర్శించారు.”

“అయితే అది విమర్శనాతీతమైంది...”

“కాని నేననేదేమిటంటే మాతృమూర్తి ఉచ్ఛాన్ని, పీచాన్నిగూడా సహిస్తుంది. విర్జసనలెత్తివేస్తుంది. అసహ్యించుకోదు. ఇలాంటిచాలా ఉన్నాయి చెప్పానివి.”

కాసేపు నిశ్శబ్దంగా గడిచిపోయింది.

"అయితే రాజూ! నువు పురుషునిలోకూడా మాతృత్వం కలగటానికి వీలుంటుందన్నావు. ఇంత వరకూ అలాంటిదేమన్నా జరిగిందా?" అన్నాడు రంగా.

"అలా అంటే చెప్పలేను. మనం గమనించటం లేదుగాని, చాలావరకు సత్యం. కావాలిస్తే చెబుతాను విను." రాజు ప్రారంభించాడు కథ... "సైలెన్స్" అన్నాడు కృష్ణ.

"మా ఊళ్ళో జరిగినది- మొన్న గాక నిన్న... మా ఊరికో తాసిల్దారు బదిలీచేయబడ్డాడు. వయస్సు బాగాచెల్లినవాడే పిల్లాజల్లాలేరు. కలిగే ఆశకూడా లేదు. భార్యాభర్తలమధ్య అనుకూల దాంపత్యం ఉంది. భార్య పార్వతీదేవిని మరిపిస్తుంది.

వాళ్లో కుక్కను పెంచారు. బొచ్చుకుక్క. వంటినిండా పెద్ద బొచ్చు, భూమికి జానెడే ఉండేది. అయితేనేం? ఎంతో అందంగాఉండేది. సన్నటి చిన్న మూతి, మెళ్ళో పటకా, పటకానిండా గజ్జెలు, పూసలు ఉండేవి. తెల్లగా మల్లెపుష్పంలా ఉండేది.

దాన్ని ఎంతగా చూచేవారో రెండు విషయాల్లో చెబుతా. ప్రొద్దున్నే అది తాసీల్దారుగారితోసహా సబ్బుతో స్నానంచేసేది. వెంటనే ఓవల్ టిన్, మధ్యాహ్నంఅన్నం. మళ్ళీ సాయంత్రం టిఫిన్‌తో ఏదో పాలో, ఏవో. మళ్ళీ రాత్రి అన్నం. వాళ్ళ యింట్లో ఏదన్నా చేసుకుంటే రామానికి—అదీ దాని పేరు— నైవేద్య పెట్టందే తినేవారుకారు. దానికి ప్రత్యేకంగా ఓ మంచం చేయించారు. దానిమీద మెత్తటి పరుపు. కాని అది దానిమీద పడుకున్న పాపానపోలేదు. అయ్య మంచంలోనో, తప్పితే అమ్మగారి ప్రక్కలోనో పడుకునేది.

ప్రొద్దున్న అయ్యగారు నిత్యకృత్యాలు నెరవేర్చుకొని ఏవో కాగితాలు వ్రాసుకుంటూ వుండేవారు. రామం ఘల్లుఘల్లుమని గజ్జెలచప్పుడు చేసుకుంటూ పరిగెత్తుకుంటూవచ్చి అయ్యగారి తొడలమీద హాయిగా పడుకునేది. ఆయనతో ఆఫీసంతా తిరిగేది. ఆయనగారెప్పుడూ ఏ గొలుసుతో దాన్ని బంధించలేదు. కాని మెడకు ప్రేమ బంధంతో ముడేశారు. ఆయనకాళ్ళల్లోనే ఉండేదెప్పుడూ. టూరు వెళితే ఆయనతో కారులో వెళ్ళేది. ఆఫీసునుంచి యింటికి, ఇంటినుంచి ఆఫీసుకు సైకిలుముందు కూర్చుని ఆయనతో వెళుతూ వస్తూ ఉండేది.

రామం ఎప్పుడూ ఒక్కమాట పడలా. దానికి ఏంచేయాలో ఏం చేయకూడదో ఆ పరిజ్ఞానం కూడాఉంది. పెద్దపెద్దతప్పులెప్పుడూ చేయలేదు. ఒకసారిమాత్రం ఆఫీసుకాగితం పాడుచేసింది. అదిచూచి అక్కడుండే ఓ జమాను తన్నాడు. అంతే. వెంటనే వాడికి డిస్‌మిస్ ఆర్డరు యిచ్చేశారు.

అంతా యీాయన పిచ్చిచూచి "కుక్కలదొర" అని పేరుపెట్టారు. అంటున్నారని ఆయనకు తెలుసు. వింటే రామాన్ని కౌగలించుకొని ముద్దుపెట్టుకొని ప్రేమతో తలనిమురుతూ నవ్వేవాడు.

ఒకసారి ఆయన ఏదో ఊర్లో అర్జంటుపని మీద వెళ్ళారు. రామానికి ఏమీ తోచలేదు. పదింటిదాకా ఆ కుర్చీదగ్గరే కూర్చునేది. వెంటనే అన్నంకోసం గొడవచేసేది. తిని ఆఫీసుకు వెళ్ళేది. అయ్యగారికోసం ఎంతో వెతికేది. మళ్ళీనిరాశతో యింటికిపోయేది. రాత్రి అయ్యగారి ప్రక్కలో పడుకుని - ప్రియుని కౌగిలికోసం తహతహలాడుతూ ఎదురుచూచే ప్రియురాలి మాదిరి-దాని హృదయం విరహంతో కొట్టుకునేది.

ఐతే "నీకు జంతుమనస్తత్వంకూడా తెలుసా" అని మీరు నన్నడగవచ్చు! కాని ఎలాంటి విషయాలనయినా ఎవరైనా చెప్పలబట్టి కనిపెట్టుతూ ఉంటారు. అమ్మగారుకూడా అంటూ ఉండేదిట. రాత్రి తెల్లవార్లు మేలుకొని "కుయ్‌కుయ్" మంటూ ఉండేదట. దుప్పటిని కసిగా అటు ఇటూ లాగేస్తూ నానాహంగామా చేసేదట. ఒక్కమాట. కుక్కకున్న విశ్వాసం మరిదేనికీ లేదు తెలుసా?

ఆ తరువాత మూడురోజూ ఉదయం జరిగింది చెబుతా. ఆ క్రితంరోజే అయ్యగారికి టెలిగ్రాం వెళ్ళింది. "రామం బెంగపెట్టుకున్నాడని" ఆయన బయలుదేరి వచ్చేశాడు. వచ్చేటప్పుడు రామానికేమేమిటో తెస్తున్నాడు. తనమీద రామానికెంతో కోపంవచ్చి ఉండిఉంటుంది. తప్పకుండా

వచ్చి ఉండాలి. ఎందుకంటె రామాన్ని తన వెంట తీసుకొని వెళ్ళలేదుగా మరి. ఉపశాంతికి ఎన్నో కొన్నాడు. అన్నీ రామానికిష్టమయినవే. బిస్కట్లు, చాక్లెట్లు, ఏమేమిటో.

గుమ్మంలో అడుగు పెట్టగానే రామం అని యెల్లెగిరె కేక వేశాడు. జవాబుగా రామాని గజ్జెలు వినపడలేదు. భార్య చెప్పింది, "పడుకుని యింకా లేవలేదు"—అని.

"అయ్యో నా పిచ్చి రామం" అంటూ తన మంచంలో ఉన్న రాముందగ్గరకు వెళ్ళాడు. వీపంతా నిమురుతూ ముద్దుగా "రామం! రామం!" అంటూ పిలిచాడు కాని సమాధానంలేదు.

చేతుల్లోకి తీసుకున్నాడు. మెడ వాల్చేసింది. భయంతో ముఖంలో ముఖం పెట్టి చూచాడు. ఆఖరిచూపు ఆయన్ను చూసి ఆఖరిశ్వాస విడిచేసింది. "రామం" అంటూ దద్దరిల్లిపోయేటట్లు అరచి రామాన్ని కౌగలించుకున్నాడు. భూమి ఒక్కసారి కంపించింది. సూర్యుడుకూడా మబ్బుల చాటుకు పారిపోయాడు. ఇల్లంతా ఆ గదిలోకి పరిగెత్తింది. "అందరిని డిస్‌మిస్ చేసా" అన్నాడు. నిజంగా పిచ్చెక్కి.

ఇంతవరకు చెప్పి రాజుకి ఓ నిట్టూర్పు విడిచాడు. కథ బాగానే నడచింది. "బహుశా ఏ జబ్బో చేసి ఉంటుంది. కనిపెట్టలేక పోయారు" అన్నాడు నూతిలోపడ్డట్టు ప్రసాదు.

"ఐతే వాళ్ళనెందుకూ డిస్‌మిస్ చేయటం?" రంగాకి అనుమానం వచ్చింది.

"పెద్దవాళ్ళతో చెలిమి పాముతో చెలగాటం. వాళ్లు ప్రేమించినా కోపించినా అతిగా ఉంటుంది" అన్నాడు క్రిష్టా.

"ఆరోగ్యం కనిపెట్టి సరైన సమయానికి మందు యిప్పించలేదని జమానావిూదా, గుమాస్తాలవిూద విరుచుకుపడిఉంటాడు" అదిరూఢే నన్నట్టు చెప్పా-నేను.

రాజు మళ్ళీ ప్రారంభించాడు....

"అయితే ఎవర్నీ ఏమీ చేయలేదు. అతని హృదయం ఎలాఉందో చెబుతున్నాను.

ఆ అయిగు బస్తాల ఉప్పు తెప్పించాడు. నిలువు గోయి తీయించాడు. అందులో పాతించాడు. ఓ మనిషికి జరగవలసిన తతంగం జరిగింది.

ఇంతవరకూ బాగానే ఉంది. అందరూ చేసేది అంతే. ఆ తరువాత జరిగింది మనకు ముఖ్యం. ప్రొద్దున్నా, సాయంకాలం చెంబెడు పాలు తీసుకుపోయేవాడు. సమాధిలోపోశేవాడు. దానికో బ్రహ్మాండమైన సమాధి కట్టించాడన్న విషయం మరచిపోకండి.

గంటలతరబడి అక్కడే కూర్చునేవాడు. "రామం!... రామం!!... రామం!!!..." అప్పుడప్పుడు హృదయాన్ని బ్రద్దలచేసుకుంటూ గాద్గద కంఠంతో ప్రేగుల్ని చీల్చుకుంటూ నడికడుపులోంచి బయలుదేరే మాటలు.

పెండ్లానికి భయమేసింది. ఆమెకుమాత్రం ఆ కుక్కమీద మమకారం లేకపోలేదు. కాని అది కట్లు తెంచి పరిగెత్తింది కాదు. మరీ మొదటి మూడురోజులు ఆయన అర్థరాత్రిదాకా ఆ స్మశానంలో నేపడి పొర్లేవాడు. దిక్కుతెలియాక భార్యహృదయం తల్లడిల్లిపోయేది. కాస్త ఆలస్యమయింది అంటే భర్త స్మశానానికి వెళ్ళనట్టే నిర్ధారణ చేసుకునేది. జమాన్లను తరిమేది.

అందర్ని చూచి అనేవాడట, "ఇంకా నాకు ఉద్యోగం దేనికిరా? ఇంకా ఎవరికోసం చేసేది? రామంలేనిదే పనెట్లాచేసేది? వాళ్లో యింకా కూర్చునేదెవరు? ప్రక్కరామూ కూర్చోకపోతే, ఆ కోర్టులో కూర్చొని నేను చెప్పేది న్యాయమో అన్యాయమో, నాకు తెలిపేదెవరు?" ఇలా భోరున ఏడ్చేవాడట.

అప్పుడప్పుడు భార్యతో చెప్పేవాడట...

"నేనుపోతే, నా రామంప్రక్కనే పాతిపెట్టిస్తావు కదూ?" ఇహ ఆ భార్య హృదయం ఎలా ఉంటుందో మీరే ఊహించుకోండి.

ఇదంతా మీకసహజంగా కనిపించవచ్చు. ఏడెనిమిది సంవత్సరాలు తన తొడలమీదకూర్చోబెట్టుకొని, తనచేతుల్తో పెంచింది పోయింది. అది జంతువుగాని, మనిషిగాని, ఏమైనప్పటికి దాన్ని అతను పెంచాడు. . ఏడు దీర్ఘసంవత్సరాలు ఎడబాటనేది లేకుండా ఒకటిగా ఉన్నారు ఏదో పిచ్చియేమో, అనుభూతో, అభిమానమో, మాతృత్వమో, పితృత్వమో నాకు తెలీదు. . ఇది వింటే మీకట్టుదల ఏ మాత్రం కరగలేదూ?... ఇప్పుడు మీరేనిర్ణయించి చెప్పండి." ★